క్లుప్తంగా

ఎమ్మెల్యేకు డాక్టరేట్ రావడంపై హర్షం

కృష్ణా: ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వర్చ్యువల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాండిచ్చేరి వారు గౌరవ డాక్టరేట్ పురస్కారం అందించడం హర్షించదగ్గ విషయమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజప్పగౌడ, సీనియర్ నాయకులు నాగేందర్, యువజన నాయకులు సంతోష్ పాటిల్, పల్లె సురేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేకు పురష్కారం లభించడం ఆనందంగా ఉందని, ఇలాంటి పురష్కారాలు ఆయనకు మరెన్నో రావాలని కోరుతున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు శివప్పసాకార్, పిట్టల్ సిద్దప్ప, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

కరపత్రాల విడుదల



మరికల్: చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన ఎస్సీ 57 ఉప కులాల కరపత్రాలను ఆదివారం మండలంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విడుదల చేశారు. ఈ మేరకు.. జిల్లా ఎస్సీ కులాల అధ్యక్షుడు కొర్ల లింగం మాట్లాడుతూ మాదాసి ధ్రువీకరణ పత్రాలు వచ్చేవరకు తమ ఉద్యమం ఆగదన్నారు. ఈ నెల 21న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్న, రాజు, మల్లేష్, బీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరి దేవి అఖండ జ్యోతి

కోస్గి: పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి దేవి అఖండ జ్యోతి ఉత్సవాలు నేటి నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ, తొగుట వీర క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా సోమవారం పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు ఉంటుందన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని, అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలి



ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ పాఠశాలలో గత కొన్నిరోజులుగా నిలిచిన మరుగుదొడ్ల పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు మహేష్‌గౌడ్, రాజు తదితరులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి 2022లో రూ. 35 లక్షల నిధులు మంజూరైందని తెలిపారు. కాంట్రాక్టర్ గత ఏడాదిగా కాలంగా నిధులు లేకపోవడంతో భవనం పనులు అసంపూర్తిగా వదిలివేశారని తెలిపారు. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి మరుగుదొడ్ల పనులను పూర్తి చేయాలని కోరారు.

అంత్యక్రియలకు నగదు అందజేత

నారాయణపేట రూరల్: మండలంలోని అప్పక్‌పల్లి గ్రామానికి చెందిన కావలి నర్సమ్మ ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియలకు ఆర్థికంగా ఇబ్బంది ఉండడంతో ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సభ్యులు తమవంతుగా రూ. 12వేలు ఆమె కుటుంబానికి అందించి భరోసా కల్పించారు. రాజు, సత్యం, కవిత, శివకుమార్, దీపక్, మహేష్, రమేష్, వెంకటేష్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

29 జీఓను రద్దు చేయాలి

మక్తల్: ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 29 రద్దు చేయాలని జిల్లా డీటీఎఫ్ అధ్యక్షురాలు డీజీ హైమవతి అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు.. రిజర్వేషన్లకు అడ్డుకట్ట వేసేందుకు 29 జీఓను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. జీఓ నంబరు 55 ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు అమలు జరుగుతుందన్నారు. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10, బీసీలకు 29శాతం ప్రకారం ఉద్యోగాలలో అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాసంఘాల నాయకులు పరందారాములు, స్పందన, సూర్యచంద్ర, మౌనిక పాల్గొన్నారు.



ఆహ్లాదం.. బహుదూరం

- స్థలం కొరతతో దూరంగా నిర్మాణాలు
- నిరుపయోగంగా మారుతున్న ప్రకృతి వనాలు
- దృష్టి సారించని అధికారులు
- లక్షలు వెచ్చించినా దక్కని ఫలితం



మాగనూర్ సమీపంలో ప్రకృతి వనం

మాగనూర్: గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామాల మధ్యలో లేదా శివారులో ఏర్పాటు చేయాల్సిన ప్రకృతి వనాలు స్థలం సమస్యతో ఊరికి దూరంగా నిర్మిస్తున్నారు. ముందుచూపు లేకుండా అధికారులు గ్రామానికి దూరంగా వీటిని ఏర్పాటు చేయడంతో ప్రజలు వాటిని వినియోగించడం లేదు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రకృతి వనాలు ప్రజల ఆదరణ కోల్పోయి వృథాగా మారుతున్నాయి.

గ్రామాలకు దూరంగా..

- మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీలో ప్రకృతి వనాలు ఏర్పాటు చేయగా, వీటి నిర్మాణాలకు సుమారు రూ. 36,10,494 నిధులు ఖర్చు చేశారు.
- గ్రామాల్లో ఎకరం విస్తీర్ణంలో పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేయాల్సి ఉండగా, స్థలం కొరతతో కొన్ని గ్రామాల్లో ఊరికి దూరంగా వీటిని ఏర్పాటు చేశారు.
- మండలంలోని వాడ్వట్, మాగనూర్, నేరడగం, ఉజ్జెల్లి, బైరంపల్లి, నేరడగండొడ్డి, కొల్పూర్, తళంకేరి, అమ్మపల్లి గ్రామాల్లో ప్రకృతి వనాలు ఊరిచివరలో ఏర్పాటు చేశారు.

పకృతి వనాలు విస్తీర్ణంలో ..

చిన్న గ్రామాల్లో ప్రభుత్వ భూమి లేకపోవడంతో తక్కువ స్థలంలో ప్రకృతివనాలను ఏర్పాటు చేశారు. మండలంలోని వాడ్వట్, పర్మన్‌దొడ్డి, ఒబ్లాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతివనాలు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గ్రామాలకు సమీపంలో ఎకరం విస్తీర్ణంలో అన్నిరకాల మొక్కలు పెంచుతున్నారు.

ఉపయోగం లేకుండా పోయింది..



మా గ్రామంలో పల్లెప్రకృతివనం గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. అధికారులు గ్రామానికి మధ్యలో లేదా గ్రామ సమీపంలో ఈ ప్రకృతివనాలు ఏర్పాటు చేసి ఉంటే బాగుండేది. ముఖ్యంగా మండలంలో కేవలం మొక్కల పెంపకం మాత్రమే చేశారు. వాటిలో కూర్చొవడానికి బెంచీలు, ఆడుకోవడానికి ఆటవస్తువులు వంటివి ఎక్కడ కనిపించడం లేదు. - శ్యామ్, తళంకేరి యువకుడు

నిరుపయోగంగా మారాయి



పల్లెప్రకృతివనాలు ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటు చేశారు. అయితే వాటిని అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగకంగా మారాయి. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు వాటిలో పాడైన మొక్కలు తొలగించి మంచి మొక్కలను పెట్టడంతోపాటు ఉపయోగంలోకి తీసుకురావాలి. - వెంకటేష్, కొత్తపల్లి గ్రామం

గ్రామ శివారులో ఏర్పాటు..



పల్లెప్రకృతి వనంలో సుమారు 4 మొక్కలు నాటాలంటే ఎకరం స్థలం అవసరం ఉంటుంది. ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఉన్న స్థలంలోనే వీటిని ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే పల్లెప్రకృతి వనాలలో మొక్కలు ఏపుగా పెరిగాయి. వనాసేవకులు మొక్కల పెంపకం విషయంలో ఎక్కడ తగ్గకుండా పని చేస్తున్నారు. స్థలం లేని గ్రామాల్లో మాత్రమే రెవెన్యూ వారు కేటాయించిన స్థలాలలో ఊరికి దూరంగా ఏర్పాటు చేయాల్సి వచ్చింది. - రహ్మతుద్దీన్, ఎంపీడీఓ, మాగనూర్

అహింసా మార్గాలే జాతికి శరణ్యం



మాట్లాడుతున్న డా. విజయ్‌కుమార్

నర్వ: సత్యం, అహింసా మార్గాలే జాతికి, దేశానికి శరణ్యమని విశ్రాంత డీఈఓ డా. విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం పాథర్చేడ్‌లో 19వ రోజు పాదయాత్రను కొనసాగించారు. ఈ మేరకు.. ఆయనకు గ్రామంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు స్వాగతం పలికారు. రాత్రి జరిగిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. గౌతమ బుద్దుడు, ఏసుక్రీస్తు, మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింసా మార్గాలు ఎల్లప్పుడు అనుసరణీయమన్నారు. అహింసా అనేది సర్వప్రాణుల మేలు కోరే తల్లివంటిదన్నారు. హింసా మార్గం ఆటవిక మార్గమన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచి మంచి అలవాట్లను నేర్పించి పుస్తక పఠనం చేయించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై అందరం అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆయనను గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం సంజన్న, బోలుబండ వెంకటేష్, యువకులు రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం

కోస్గి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు పాలక వర్గ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి శివశంకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమానికి పలువురు మార్కెట్‌శాఖ అధికారులు హాజరవుతున్నారన్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

పెద్దచింతకుంట హెచ్‌ఎంకు రాష్ట్రస్థాయి అవార్డు

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గుండ్రాతి గోవర్ధన్‌గౌడ్‌కు రాష్ట్ర స్థాయి ఎక్స్‌లెన్స్ టీచర్ అవార్డును అందకున్నాడు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ మరియు స్కైల్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పెద్దచింతకుంట హెచ్‌ఎంకు ఈ అవార్డుతో సత్కరించి అభినందించారు. ఈ మేరకు.. పాఠశాల ఉపాధాయ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.



అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

నారాయణపేట రూరల్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు నారాయణపేట విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆదివారం జరిగిన పోటీలలో మాస్టర్ కేశవ్ అకాడమీలో అశోక్‌తో శిక్షణ పొందిన ప్రవంతి, కార్తీక్ అండర్ 14 విభాగంలో చక్కటి ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో అకాడమీ నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

హామీలను నెరవేర్చాలి..

నారాయణపేట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐకేఎంఎస్ నాయకులు యాదగిరి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరంగల్ డిక్లరైజేషన్ వెంటనే అమలు చేయాలని, రైతు డిక్లరేజేషన్‌లో ఇచ్చిన వాటిని నెరవేర్చి అన్నదాతలకు అండగా నిలవాలని కోరారు.

రైతు భరోసాను ఎగ్గొట్టేందుకు కుట్ర



కోస్గిలో ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా కేంద్రంలోని శ్రీ సత్యనారాయణ చౌరస్తాతోపాటు నియోజకవర్గంలోని దామరగిద్ద, ధన్వాడ, మరికల్, కోయిలకొండ మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. రైతు బరోసాను ఎగ్గొట్టిన కాంగ్రెస్‌కు రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- కోస్గి పట్టణంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక శివాజీ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం ఇవ్వకుండా వానాకాలం సీజన్ ముగిసిందని తప్పించుకోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, కౌన్సిలర్ జనార్దన్‌రెడ్డి, ముశ్రీఫా మాజీ ఎంపీటీసీ పోషప్ప, వెంకట్‌నర్సింహులు పాల్గొన్నారు.
- రైతు భరోసాను ఎగ్గొట్టేందుకే కాంగ్రెస్ పార్టీ కుట్రపన్నుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అన్నారు. నర్వ అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు.. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, మండల బీఆర్ఎస్ నాయకులు దండు అయ్యప్ప, డా.శంకర్, జనార్దన్, లక్ష్మినర్సింహా, కల్వాల్ ఆంజనేయులు, సుధీర్, రాజారెడ్డి, శివ, అశోక్, వెంకట్‌రెడ్డి, గుడిసె వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.
- ప్రభుత్వం రైతుభరోసాను వెంటనే విడుదల చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు ధన్వాడ మండలంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు.. మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.
- మరికల్ మండలంలోని స్థానిక చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలోరాస్తారోకో చేశారు. ఈ మేరకు.. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య మాట్లాడారు.. రైతు భరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్ శెట్టి, మోహన్, రవి, కృష్ణయ్య, శ్రీను, విష్ణు, నర్సింహులు, ఆనంత్‌రెడ్డి పాల్గొన్నారు.
- రైతు భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్‌నాయకులు దామరగిద్ద అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు.. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సుభాష్ మాట్లాడుతూ.. ఏకకాలంలో రెండు లక్షల పంట రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్ మాట తప్పారన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రకాంత్, తిప్పన్న, సాయిరెడ్డి, మాణిక్యప్ప, మధుసూదన్ రెడ్డి, మొగులప్ప, గజలప్ప పాల్గొన్నారు.



నర్వలో ధర్నాచేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



దామరగిద్దలో ..

పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవానికి ఏర్పాట్లు



పరెడ్ గ్రౌండ్లో ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ సోమవారం జిల్లా కేంద్రంలో సంస్మరణ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఎస్పీ నేతృత్వంలో జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు. అనంతరం జిల్లా అదనపు ఎస్పీ రియాజ్ ఆధ్వర్యంలో పరేడ్ కొనసాగుతుంది. దీనికి ఆర్ఐ నరసింహ పరేడ్ కమాండర్‌గా విధులు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సిక్తా పటాన్నాయక్‌తోపాటు జిల్లాలోని ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు హాజరై అమరవీరులకు నివాళులర్పిస్తారు. అనంతరం పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి వీర సావర్కర్ చౌరస్తా మీదుగా సత్యనారాయణ చౌరస్తా, అంబేద్కర్ సర్కిల్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు పోలీస్ ర్యాలీ నిర్వహిస్తారు. ఈ కవాతులో వివిధ విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు పాల్గొంటారు.

పది రోజులు కార్యక్రమాలు..

అక్టోబర్ 21నుంచి 31వరకు పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ పోలీస్ ఫ్లాగ్ డేను నిర్వహిస్తున్నట్లుగా ఎస్పీ ప్రకటించారు. ఈ పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకొని తొలిరోజు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించగా, తదుపరి రోజుల్లో షెడ్యూల్డ్ ప్రకారం జిల్లా పరిధిలోని ఔత్సాహిక ఫొటో, వీడియో గ్రాఫర్లకు షార్ట్ ఫిలిం, ఫొటోగ్రఫీ కాంపిటీషన్ నిర్వహిస్తారు. వీటితోపాటు జిల్లా పోలీస్ కళాబృందం సభ్యులచే వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై పోలీస్ అమరవీరుల కుటుంబాలకు బాసటగా నిలవాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం



శంకరప్పను సన్మానిస్తున్న గ్రామస్తులు

నారాయణపేట రూరల్ : మండలంలోని పిల్లిగుండ్ల తండా పంచాయతీ పాతతండా ప్రభుత్వ పాఠశాలలో 15సంవత్సరాలుగా హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన శంకరప్పకు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు.. నూతనంగా విధుల్లో చేరిన సుకన్యకు స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, ఎంతో మందికి గురుకుల, స్పోర్ట్స్ స్కూల్స్‌కు పలువురు విద్యార్థులు ఎంపికయ్యేందుకు శిక్షణ ఇచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కురుమూర్తి, పాఠశాల చైర్మన్ రుక్కమ్మ, భీమేశ్వరి, చంద్రశేఖర్, రాందాస్, గణేష్, తిరుపతి, సునీల్, రాజు, రాము, చంద్రమ్మ, బుజ్జమ్మ, సీతమ్మ, ప్రమీళమ్మ, సక్రమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి వినతి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: విద్యార్థినుల ఉత్తమ విద్యా బోధనకు ఎన్నో సంవత్సరాలుగా సేవలను అందిస్తున్న కేజీబీవీ టీచర్లకు ప్రభుత్వం మినీమం టైం స్కేల్ ఇచ్చేవిధంగా మండలిలో తమ గొంతుకను వినిపించాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహ ఆదివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హైదరాబాద్ వెళ్లిన వారు ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. కేజీబీవీ టీచర్లతోపాటు ఎస్ఎస్ఏ ఉద్యోగులను సైతం పార్ట్ టైం ఉద్యోగుల నుంచి పూర్తి సమయం ఉద్యోగులుగా గుర్తించేందుకు ఒత్తిడి తేవాలన్నారు. కేజీబీవీలో కేర్ టేకర్ల నియామకం చేపట్టాలని, ఎస్ఓలకు ఉన్న అదనపు పనిభారం నుంచి విముక్తి కలిగే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హన్మంత్‌రావు, మల్లికార్జున్, సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన చౌడేశ్వరి మాత ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు



చౌడేశ్వరి దేవికి అలంకరణ

ఊట్కూరు: మండలంలోని రెండు రోజులుగా కొనసాగుతున్న చౌడేశ్వరి దేవి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈమేరకు.. ఆలయ ప్రాంగణంలో హోమం, జ్యోతిప్రదక్షణ, బలి, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గండిమి తోటప్ప, బుద్ది విఠోభ, రిటైర్డ్ బ్యాంక్ అధికారి కోటి సుభాష్, రాజశేఖర్, వడ్ల మోనప్ప పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీలు ప్రారంభం

మక్తల్: పట్టణంలోని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్, విశ్రాంత పీఈటీ గోపాలం జెండా ఊపి సైక్లింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి వచ్చేనెల 4నుంచి 6 వరకు జనగామలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు అంబ్రేష్, దామోదర్, రమేష్, సౌమ్య, రేణుక, పుష్పలత, ప్రసన్నకుమారి, శ్రీలత, స్వరూప, మీనకుమారి తదితరులు పాల్గొన్నారు.



సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న విశ్రాంత పీఈటీ గోపాలం

హరియాణా గవర్నర్‌ను కలిసిన నామాజీ



నారాయణపేట రూరల్ : తెలంగాణ వాసీ, హర్యానరాష్ట్ర గవర్నర్ బండారు దత్తత్రేయను బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావునామాజీ ఆదివారం చండీఘడ్ రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా యోగక్షేమాలను తెలుసుకున్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విన్నర్‌కు ట్రోఫీ అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ధన్వాడ: మండల కేంద్రంలో 15రోజులుగా నిర్వహిస్తున్న ధన్వాడ ప్రీమియర్ లీగ్ రెండవ సీజన్ క్రికెట్ పోటీలు ఆదివారం ఫైనల్ మ్యాచ్ కొనసాగింది. ఇందులో ఆర్‌జే-11, విక్రమ్-11 టీంలు పోటీపడగా ఆర్‌జే-11జట్టు విజయం సాధించించారు. సాయంత్రం విజేతలైన ఆర్‌జే-11 టీంకు మొదటి బహుమతి రూ.50వేలు, అలాగే రన్నర్ విక్రమ్-11 టీంకు రూ.25వేల బహుమతులను, ట్రోఫీ బీజేవైఎం నాయకులు ప్రవీణ్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆర్గనైజర్స్, క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రయ్య,ఉమేష్, మాకం సురేందర్, శివరాజు, సత్యనారాయణ, సుదర్శన్‌గౌడ్, చక్రి, రవి, కురుమూర్తి ఉన్నారు.